రూ.10 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి:-చింతపల్లి: పాడేరు ఘాట్ రోడ్ లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, గిరిజన సహకార సంస్థ చైర్పర్సన్ శోభ స్వాతి రాణి ల చేతుల మీదుగా శుక్రవారం పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ రూ.10 లక్షల ఆర్థిక సహాయం చెక్కును సీసా విశ్వేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు మండలం బరిసింగి పంచాయతీ కొత్త ఊరు గ్రామానికి చెందిన సీస కొండబాబు ఆగస్టు 20వ తేదీన పాడేరు ఘాట్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, ఐటిడిఏ ఏ పీవో విఎస్ ప్రభాకర్ రావు, ఎంపీపీ కొరాబు అనూష దేవి, జీకే విధి ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియ పుష్పలత, గొందురు సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

చెక్కును ఇస్తున్న భాగ్యలక్ష్మి, సుభద్ర

పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు

యుటిఎఫ్ నిరవధిక దీక్షలు


పాడేరులో దీక్ష విరమింపజేస్తున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-యంత్రాంగం:

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకులోయ, చింతూరులో నిరవధిక నిరాహార దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ నేతలు నినాదాలు చేశారు.

పాడేరు: పాడేరులో శుక్రవారం నిర్వహించిన దీక్షా శిబిరం వద్ద యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విల్సన్ బాబు, మహేశ్ మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్ కేంద్రంలో తలపెట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని పోలీసులు బలవంతంగా తొలిగించి పోలీసులు స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమన్నారు.ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు కదిలి వచ్చి భవిష్యత్తు పోరాటాల్లో సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.
సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ దీక్ష శిబిరాన్ని సందర్శించి ఉపాధ్యాయులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు . అనంతరం ఆయన మాట్లాడుతూ,నూతన పెన్షన్ విధానాన్ని దేశవ్యాప్తంగా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయల న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అసోసియేట్ అధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు రఘునాథ్, ధర్మారావు, దేముడు నిరవధిక దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు ఆంధ్రేయ, విశ్వరాజ్, కర్రిబాబు. నైని. కోండబాబు, సతీష్ కుమార్, లింగన్న, గోపి, ఆశా, అంగన్వాడీలు కోండమ్మ, మంగమ్మ, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

పలు ప్రజా సంఘాల మద్దతు

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాడేరు లో చేపట్టిన నిరవేదిక నిరాహార దీక్షకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ విద్యార్థి సంఘాలు సందర్శించి యుటిఎఫ్ నాయకులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కె.ప్రభుదాస్ విలేకరులతో మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పార్టీ అధికారంలో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి, గెలిచిన తర్వాత ఇచ్చిన హామీని మర్చిపోయారని విమర్శించారు.

ప్రజా క్షేత్రంలోని తేల్చుకుంటాం

అరకులోయరూరల్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాక్షేత్రంలోని తేల్చు కుంటామని యుటిఎఫ్ అల్లూరి ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నిరవధిక దీక్షను అరకువేలి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర యుటిఎఫ్ సీనియర్ నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎస్ రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ దీక్షకు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం జిపిఎస్ తీసుకు వచ్చి తీవ్రంగా మోసం చేస్తుందన్నారు.పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ చేయాలన్నారు.

చింతూరులో...

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను పరిష్కరించాలని ఉద్యోగులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు.

అరకులో మాట్లాడుతున్న సురేంద్ర

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ లేని జిపిఎస్ ఇస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు.సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు నాయకులను నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో టి.విజయ్, ఎస్.కన్నయ్య, బాబ్జి, శ్రావణ్, మేఘనాథ్, దుక్కు, కోగేశ్వరరావు, నాగేశ్వరరావు, రామచంద్ర, ఎల్.జయరాం, ఎల్బీ రవి, పరమేష్, బీబీ విజయ్, కె.సత్యనారాయణ, నారాయణ, జి నారాయణ, బి.సింహాచలం, ఎస్ బొంజు బాబు, కె పొన్నాలు, డి సోమ శేఖర్, జి.త్రినాథ్ అనంతగిరి, అరకువేలి డుంబ్రిగూడ మండల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

చింతూరు: నూతన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీయుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం చింతూరు కేంద్రంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఎం.కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఐటిడిఏ కన్వీనర్ యు.వెంకటనారాయణ మాట్లాడుతూ జిపిఎస్ విధానంలో పెన్షన్‌కు గ్యారెంటీ లేదన్నారు. నిరాహార దీక్షలకు సీఐటీయూ మండల కార్యదర్శి పి.లక్ష్మణ్ మద్దతు తెలిపారు. యుటిఎఫ్ నాయకులు సీతా, ఎం.నందిని, సిహెచ్ సత్యవతి దేవి, కే శాంతమ్మ, జయలక్ష్మి, కే రాజయ్య, టి సుబ్బారావు, జోగారావు, ఎం రాంబాబు, కే వీరయ్య, ముత్తయ్య, బి సావిత్రి రత్న రావు దీక్షల్లో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి కృష్ణయ్య, ఎస్ నాగేశ్వరరావు, కోనవరం చింతూరు, వీఆర్.పురం, ఎటపాక మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

రికార్డులు పక్కాగా నిర్వహించకుంటే చర్యలు

- ఐటిటిఎ పిఒ సూరజ్ గనోరే హెచ్చరిక

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీలోని గ్రామ సచివాలయాలలో రికార్డులు పక్కాగా నిర్వహించాలని, లేనియెడల తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే హెచ్చరించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతాన్ని ప్రాజెక్ట్ అధికారి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా గుర్తేడు గ్రామంలో గ్రామ సచివాలయాన్ని పరిశీలించి, ఎంతమంది సిబ్బంది ఉన్నది, ఏఏ రికార్డులు నిర్వహించుచున్నది పరిశీలించారు. సచివాలయంలోని రికార్డులు సక్రమంగా నిర్వహించినందుకు ప్రాజెక్ట్ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రిజిస్టర్లు పరిశీలించారు. ఈ ఎగువ ప్రాంతంలో ఆస్పత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీలకు రక్తహీనత లేకుండా సంబంధిత మందులు అందజేయాలని సూచించారు. తరువాత పులోవ గ్రామానికి సంబంధించిన సుమారు రెండు కిలోమీటర్ల సీసీ రోడ్డు పనులను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. గ్రామంలోని గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నది లేనిదీ అడిగి తెలుసుకున్నారు. జి.వట్టిగడ్డ గ్రామానికి సంబంధించిన సుమారు రెండు కిలోమీటర్ల డబ్ల్యూబిఎం రోడ్డును పిఒ పరిశీలించారు. ఈ రెండు రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు, అస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యంవివి సత్యనారాయణ. శివరాం చందు, మండల విద్యాశాఖ అధికారి తాతబ్బాయి దొర, ఉపాధి హామీ పథకం ఏపీవో స్వామి తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారుల డుమ్మా

ప్రజాశక్తి -హుకుంపేట:-మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడవ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ కూడా రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు నివేదిక సమర్పించారు. సభకు డుమ్మా కొట్టిన ఆయా శాఖల అధికారులపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదుకు చేసేందుకు సమావేశంలో తీర్మానించారు. రహదారి నిర్మాణనికి అటవీశాఖ అధికారులు అనుమతులు మంజూరు చేయాలని సర్పంచులు, ఎంపిటిసిలు కోరారు.మండల కేంద్రలో ట్రాఫిక్ సమస్యలేకుండా చూడాలని తడిగిరి సర్పంచ్ పి రంజిత్ కుమార్ కోరారు. మండల కేంద్రంలో పంట పొలాల్లో విచ్చలవిడిగా మద్యపానం సేవించి సీసాలను పంట పొలాల్లో పారవేస్తూ చుట్టుపక్కల గ్రామస్తులను భయ పెడుతున్నారని కొంతిలి సర్పంచ్ రేగం రమేష్ తెలిపారు. హుకుంపేట పిహెచ్‌సిలో అదనంగా వైద్యాధికారిని నియమించాలని తీర్మానించడం జరిగిందన్నారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు రానప్పుడు తమ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని సర్పంచులు, ఎంపీటీసీలు చెప్పడంతో వారిపై ఫిర్యాదులకు సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ వెంకటరావు, తహసిల్దార్ రాజ్యలక్ష్మి, ఐసిడిఎస్ శాఖ సిహెచ్ బాలమణి దేవి, జెఈ రమేష్ బాబు, పంచాయతీరాజ్ శాఖ ఏఈ ఏ ఎస్ సంజీవరావు, ట్రైబల్ వెల్ఫేర్ జేఇ ధ్రువ కుమార్, ఏపీవో లింగమూర్తి, వైస్ ఎంపీపీలు. ప్రియాంక, సుడిపల్లి కొండలరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి. ఎం విశ్వేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సావిగా సాగుతున్న సమావేశం

సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పుల్లయ్య తదితరులు

స్కానింగ్ విభాగం పరిశీలన

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న స్కానింగ్ విభాగాన్ని శుక్రవారం చింతూరు డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, డిప్యూటీ డెమో అధికారి రవికుమార్ సందర్శించి పరిశీలించారు. స్కానింగ్ విభాగంలో ఎంత మంది గర్భిణులకు ప్రతి నెలా స్కానింగ్ సేవలు అందుతున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్‌కు సంబంధించిన లైసెన్సులు, రికార్డులను పరిశీలించారు. కోతులగుట్ట సిహెచ్‌సిలో ఉన్న స్కానింగ్ సెంటర్ కూటూరు, రేఖపల్లి, జీడిగుప్ప, గౌరిదేవిపేట, నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణులకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక వైద్యులు తెలిపారు. ప్రతి నెలా 9 తేదీన జరిగే పీఎంఎస్ఎంఏ స్కానింగ్ డే ద్వారా ఇక్కడకు వచ్చే గర్భిణులకు స్కానింగ్ చేయడంతో పాటు వైద్య పరీక్షలు, ఆరోగ్య పరమైన సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూనవరం సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ కె.మహేష్‌బాబు, హెడ్ నర్స్ బి.బొజ్జి, స్టాఫ్ నర్స్ వై.అనసూర్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

ఖాళీ బిందెలతో ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: రంగిలిసింగి పంచాయితీ ముసర్లంక, కింజేరు కుడబీర్ గ్రామాల్లోని గ్రావిటీ పథకాలను వెంటనే మరమత్తు చేసి తగునీటి సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు శుక్రవారం కింజేరు గ్రామంలో ఖాళీ బిందెలతో నిరుపయోగంగా ఉన్న గ్రావిటీ టేపుల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు కె.దోంబు మాట్లాడుతూ ఆ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సోలార్ గ్రావిటీ పథకాలు సుమారు ఐదు నెలల నుంచి మరమత్తుకు నోచుకోకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తప్పని పరిస్థితిలో గ్రామానికి సమీపంలో ఊట గెడ్డలను పొలాల నుంచి వచ్చే నీటిని సేవిస్తూ పలు అనారోగ్యాలకు గురవు తున్నారని చెప్పారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు మరమ్మత్తు చేపట్టలేదన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గ్రావిటి పథకాలను మరమ్మతు చేసి వెంటనే తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మహిళలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని కూల్చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ కిరాణా వ్యాపారి, గిరిజన నేతరుడు వైశ్యరాజ మధుసూదన్‌రావు ఎంపీడీవో క్వార్టర్స్ సమీపంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తక్షణమే కూల్చి వేయాలని అదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కే.నరసయ్య ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహసిల్దార్ రాజుకు శుక్రవారం వినతిపత్రంన్ని అందించారు. ఈ సందర్భంగా నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్, మండల వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణలు మాట్లాడుతూ, 1/70 చట్టం గిరిజన ప్రాంతంలో అమలులో ఉన్నప్పటికీ ప్రభుత్వ భూములలో గిరిజనేతరులు దర్జాగా కబ్జా చేసి అక్రమ కట్టడాలు చేపడుతుంటే మండల రెవెన్యూ శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు.మండల కేంద్రంలో 1/70 చట్టాన్ని అతిక్రమిస్తూ అక్రమ కట్టడాలను చేపడుతున్నారన్నారు. ఎధుసూదన్ రావు నిర్మిస్తున్న అక్రమ కట్టడానని తక్షణమే కూల్చివేయాలని, లేని పక్షాన ఆదివాసి గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో కూల్చి వేస్తామన్నారు. గతంలో ఇదే తరహాలో అనేకమార్లు రెవెన్యూ శాఖకు ఫిర్యాదులు చేసినా అక్రమ కట్టడాన్ని అడ్డుకోలేకపోయారన్నారు. తక్షణమే ఎల్‌టిఆర్ కేసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అధికార పార్టీ రాజకీయ నాయకుల అండదండలతోనే మండల కేంద్రంలో గిరిజనేతరులు అక్రమ కట్టడాలు కడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘ నాయకులు ఎస్,గాశిరం దొర, జి నారాయణ, పి.రామదాసు, ఏం.నర్సింగ్ పడల్, కె.బాలరాజు, సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని డౌనూరు గ్రామ పంచాయితీ పరిధిలో 4 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర, వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి శుక్రవారం ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అరుకు కాఫీకి ప్రపంచంలో మంచి డిమాండ్ ఉందన్నారు. ఢిల్లీలో జరిగిన 20 దేశాల సదస్సులో ప్రధానమంత్రి అరకు కాఫీని బహుమతిగా ఇచ్చారని తెలిపారు. గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. జిసిసి ద్వారా కాఫీ హౌసింగ్ చేయటానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. రూ.500 కోట్లతో జిసిసి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరు నెలల్లో యూనిట్ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మాట్లాడుతూ బెంగళూరులో కాఫీ ప్రాసీసింగ్ జరుగుతున్నట్లుగా డౌనూరులో కాఫీ రైసింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ యూనిట్ ఏర్పాటు కాఫీ రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఐటిడిఎ పిఓ అభిషేక్, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, ఎమ్‌డి సురేష్ కుమార్, జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపిటిసి అప్పారావు, సర్పంచ్ భవాని, ట్రైకార్ డైరెక్టర్ సుర్ల లోవరాజు, పోతురాజు, నీలపు సూరిబాబు, సురేష్ పట్నాయక్, పెట్ల గాంధీ, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, చిత్రంలో వైవి.సుబ్బారెడ్డి తదితరులు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ మోహన్‌కుమార్ తదితరులు

పర్యాటక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని రంప, పోలవరం వాగు ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు తెలిసే విధంగా పోలీసులు శుక్రవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎస్ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ మైదాన ప్రాంతాల నుంచి రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు వాగులలో దిగి మృతి చెందుతున్నారని తెలిపారు. అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలలో భాగంగా ప్రతి పర్యాటక ప్రదేశంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పర్యాటక ప్రదేశాల్లో పోలీస్ పహారా కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంటింటి సర్వే 99 శాతం పూర్తి

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

సమావేశంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఓటర్ జాబితాలో తప్పులు సరి చేయుటకు రంపచోడవరం ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల్లో ఇంటింటి బూత్ స్థాయి సర్వే 99 శాతం పూర్తి చేసినట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ సవరణ ప్రక్రియ గురించి సబ్ కలెక్టర్ సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో11 మండలాలలో ఎన్నికల సంఘం నిబంధన మేరకు బూత్ స్థాయిలో సర్వే చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని 399 పోలింగ్ బూతుల పరిధిలో ప్రస్తుతం 2 లక్షల, 72 వేల నలుగురు ఓటర్లు ఉన్నారన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుండి అక్టోబర్ 18వ వరకు ఫారం-6 ద్వారా ఓటర్ల నమోదు కొరకు 376 దరఖాస్తులు, ఫారం-7 ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగింపునకు 1047, ఫారం-8 ద్వారా ఓటర్ పేర్లలో తప్పులు, ఫొటోలు సరి చేయడానికి 1147 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముందు రోజు వరకు ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత ఫారములు ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల బూతులు, ఓటర్ కార్డులో తప్పులకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని వివిధ పార్టీల ప్రతినిధులను సబ్ కలెక్టర్ కోరారు. ఇంకా ఎక్కడైనా పోలింగ్ బూతులు ఏర్పాటు అవసరమైతే లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేస్తే ప్రతిపాదన జిల్లా కలెక్టర్‌కి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్.బొజ్జిరెడ్డి, పి.శ్రీనివాసరావు, ఎం.వాణిశ్రీ, ముర్ల కృష్ణారెడ్డి, ఎం.ఈశ్వరరావు, డిప్యూటీ తహశీల్దారు ఎస్‌వివి.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరాబాయి, టి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని డౌనూరు గ్రామంలో బోరుబావి డ్రిల్లింగ్ పనులను శుక్రవారం వైసిపి నాయకులు సురేష్ పట్నాయక్, మండల బూత్ కన్వీనర్ పోతురాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ పట్నాయక్ మాట్లాడుతూ డౌనూరు గ్రామస్తులు తీవ్ర తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న విషయాన్ని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ఆమె స్పందించి ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామస్తులు అరకు ఎంపీ మాధవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సింహాచలం, నూకరాజు, హనుమంతరావు, కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరు బావి డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు సురేష్ పట్నాయక్

రోడ్డు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి- అనంతగిరి:మంజూరైన రోడ్డు పనులు ప్రారంభించ పోతే అల్లూరి కలెక్టర్ కార్యాలయం వద్ద డోలీలు, గుర్రాలతో ఆందోళన చేపడతామని పీవీటీజీ గిరిజన సంఘం నాయకుడు సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పినకోట, పెద్దకోట, జీనబాడు. పంచాయతీ పరిధిలో కొండ శిఖర గ్రామాలైన ఒల్లగరువు నుండి దాయెర్తి గ్రామం వరకు 8 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి. మిషన్ కనెక్ట్ పాడేరు ఎపీఆర్‌జీఎస్ నిధులు మంజూరై రెండు సంవత్సరాలు అవుతున్నా పనులు మొదలు పెట్టలేదన్నారు. దీంతో ఈ గ్రామాలకు ఆనుకొని ఉన్న పీచు మామిడి, గుమ్మంతి, కరకవలస, గుర్రాలు బైలు, రాచికిలం, రెడ్డిపాడు, మద్దేలు, తునిసిబు, కోటల గరువు గ్రామాలకు చెందిన పీవీటీజీలు నిత్యావసర సరుకులు, వైద్య కోసం వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. 20. కిలోమీటర్ల దూరం డోలి మోసుకొని లేదా గుర్రాలపై ప్రయాణం చేయవలసిన పరిస్థితి. ఏర్పడి తుందన్నారు. అటవీ ఉత్పత్తులు అమ్ముకోవాలంటే గుర్రాలపై వారపు సంతలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.

మత్స్యలింగం సందర్శనలో కొమ్మినేని


కొమ్మినేని దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-హుకుంపేట : మండలంలోని మఠం పంచాయతీలో ప్రముఖ పుణ్య క్షేత్రం మత్స్య గుండంలోని మత్స్య లింగేశ్వరస్వామిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక ప్రాంతం మత్స్య గుండం సందర్శించడం ఆనందంగా ఉందన్నారు, ఆలయ చరిత్ర, మత్స్య గుండం విశిష్ట తను ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు టి అప్పారావు, ఎం.సూర్య నారాయణ నాయుడు, కమిటీ సభ్యులు పి.మత్స్య కొండ బాబు, ఎం.సింహా చలం, ఎం.గోపాల పాత్రుడు, రామ్ బాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల 1 లో 2005-2006లో పదవ తరగతి చెందిన 114 మంది విద్యార్థులు ఒకే వేదికపై అపూర్వ కలయిక శుక్రవారం చోటుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయతలు పలకరించుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమం సురేష్, నాగభూషణం, శేఖర్, శ్యామ్, సునీల్, మోహన్ పాల్గొన్నారు.

వీల్ చైర్ అందజేత

కుర్చీ ఇస్తున్న పిఒ

ప్రజాశక్తి:చింతపల్లి మండలంలోని కోరుకొండ గ్రామానికి చెందిన కొర్రా నూకాలమ్మ అనే వికలాంగురాలికి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో చక్రాల కుర్చీని అందజేశారు. చక్రాల కుర్చీ మంజూరు చేయాలని కోరగా పి.ఓ సానుకూలంగా అప్పట్లో స్పందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి జి.కొండలరావు, ఐటిడిఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి విఎస్ ప్రభాకర్, తహసీల్దార్ లక్ష్మీపత్రుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే డిఇఒ కార్యాలయం ముట్టడి

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

మాట్లాడుతున్న వరలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి చెప్పారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు [illegible] ఆదివ వస్త్రం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఒక పద్ధతి అయితే, అల్లూరి జిల్లాలో మాత్రం మరో పద్ధతి నడుస్తుందన్నారు. సగటు కార్మికురాలికి నెలకి రూ.3000 చొప్పున వేతనాలు ఇవ్వవలసి ఉండగా 2000 చొప్పున ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఒక పిల్లవాడికి మధ్యాహ్నం భోజనం పథకంలో 5 రూపాయల 88 పైసలు ఇస్తున్నారని, పెరిగిన ధరలకు ఇది సాధ్యమా అని ప్రశ్నించారు. సీఎం జగన్మోహన్ రెడ్డికి మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు పెంచడానికి మనసు రాలేదని, 100 కోట్లతో అక్షయపాత్రకి ఇవ్వడానికి మాత్రం డబ్బులు ఉంటాయా అని ప్రశ్నించారు. 25 మంది పిల్లలు ఉంటే ఒక వంట వర్కర్, 26 నుంచి 100 లోపు ఉంటే ఇద్దరు, 100నుంచి ఎక్కువ ఉంటే ముగ్గురు ఉండాలని, ఈ పద్ధతిని అల్లూరి జిల్లాలో పాటించలేదన్నారు. దీంతో, మధ్యాహ్న భోజన కార్మికులకు ఒత్తిడి, పని భారం ఎక్కువ పెరుగుతుందన్నారు. పిల్లవాడికి ఇచ్చే రోజు మెనూ పెంచి గ్యాస్ ప్రభుత్వమే సప్లై చేయాలన్నారు. వంట షెడ్డు నిర్మించాలని, జీతాలు 15000 కనీసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, మధ్యాహ్న భోజన సంఘం జిల్లా నాయకులు వద్ద, మంగ, దున్న లక్ష్మి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-చింతపల్లి:రాజకీయ పార్టీలకు అతీతంగా పేద ప్రజల సంక్షేమమే వైకాపా ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం చింతపల్లిలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, శాసనమండలి సభ్యులు అప్పిరెడ్డి, పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికి పథకాలు అందిందించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. పథకాలలో అవినీతికి తావు లేకుండా పాలన సాగిస్తున్న ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. మన్య ప్రాంతంలో మెరుగైన వైద్యసేవలను అందించడం లక్ష్యంగా పాడేరు లో 500 కోట్ల రూపాయల నిధులు వెచ్చించి వైద్య కళాశాల, చింతపల్లిలో 100 పడకల ఆసుపత్రిని నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి మారుమూల గ్రామాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలనే సదుద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చి, అమలు పరచడం జరుగుతుందన్నారు. ఈనెల 26 నుంచి తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, గిరిజన సహకార సంస్థ చైర్పర్సన్ శోభ స్వాతిరాణి, రాష్ట్ర ట్రైకర్ చైర్పర్సన్ శతక బుల్లి బాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మత్స్యరాస వెంకటలక్ష్మి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్, జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి, పాడేరు నియోజకవర్గం పరిశీలకులు ఫరిద్, మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అచ్యుత్ రావు, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్బ నర్సింగరావు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధిపై దృష్టి సారించాలి

నేషనల్ మీడియా ఇంటర్నేషనల్ అఫైర్స్ సలహాదారు దేవులపల్లి అమర్

ప్రజాశక్తి- అరకు లోయ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రకృతి సిద్ధమైన సహజ వనరులు వున్నందున పర్యాటక రంగాన్ని సరైన రీతిలో ప్రపంచానికి పరిచయం చేయటం ద్వారా ఆదాయం లభిస్తుందని జాతీయ మీడియా అంతర్జాతీయ వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.శుక్రవారం అల్లూరి జిల్లా పర్యటన లో భాగంగా అరకు చేరుకున్న అమర్‌ను డిపిఆర్‌ఓ పి. గోవింద రాజులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్థానిక గిరిజన సంస్కృతిగా మ్యూజియంను సందర్శించారు. అక్కడి స్టాల్స్ ను సందర్శించి గిరిజన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో అమర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక రంగంపై మరింత దృష్టి సారించాలని, పర్యాటకులకు రవాణా, వసతి, కమ్యూనికేషన్ వంటి సౌకర్యాలు కల్పిస్తే రెవెన్యూ పెరుగుతుందని తెలిపారు.రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిన మాట వాస్తవమేనని, అయినప్పటికీ ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తయితే విశాఖపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధికి అవకాశం పెరుగుతుందని, విదేశీ పర్యాటకులు పెరుగుతారని తెలిపారు.

కళా వేదిక వద్ద అమర్

సమస్యల పరిష్కారానికి ఆందోళన

ఆందోళన చేపడుతున్న ఐటిడిఎ కార్మికులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : సమస్యలు పరిష్కరించాలని తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సిఐటియు, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం మండల తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడి రాజు మాట్లాడుతూ, తక్కువ వేతనాలతో పని చేస్తున్నామని, ధరలు పెరగడంతో వేతనాలను సరిపోలేదని తెలిపారు. తక్షణం కార్మికులందరికీ కనీస వేతనం చట్ట ప్రకారం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. 2011-12 సంవత్సరంలో పద్మావతీ గార్డెన్, కొత్తవలస ఫారంలో పని చేస్తున్న కార్మికుల వద్ద పీఎఫ్ పేరుతో వేతనంలో పర్సంటేజ్ కటింగ్ చేసి పిఎఫ్ ఆఫీస్‌కి చెల్లించకుండా ఐటిడిఏ అధికారులు ఎగ్గొట్టారన్నారు. తక్షణం తిరిగి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కోట్లాధి రూపాయిల ఆదాయం వస్తున్నా కార్మికులకు జీతాలు పెంచలేదన్నారు. సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, గురువులు, సునీల్ మంగళయ్య, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి మృతి

ప్రజాశక్తి- అరకులోయ:గత కొద్ది రోజులుగా గొంతి నొప్పితో బాధపడుతున్న గిరిజన విద్యార్థిని శుక్రవారం మృతి చెందింది. మండలంలోని బస్కి గ్రామానికి చెందిన సమర్థి హస్మిత అనే గిరిజన విద్యార్థిని (12) కొత్తభల్లు గూడా ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యనుభ్యసిస్తుంది. గొంతు నొప్పి తో బాధపడుతున్న ఆమె దసరా సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. పరిస్థితి విషమించి మృతి చెందింది. సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు విలేకరులతో మాట్లాడుతూ, హాస్టల్స్‌లో మంచినీరు లేకపోవడంతో గొంతు నొప్పి ఇతర వ్యాధులకు బారిన విద్యార్థినులు పడి మృత్యువాత పడుతున్నారని ఆయన అన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించి మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.గిరిజన సంక్షేమ హాస్టల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మద్రెబులో జ్వరాలు

జ్వరంతో బాధపడుతున్న బాలుడు

ప్రజాశక్తి - అనంతగిరి:పెద్దకోట పంచాయతీ మద్రెబులో ఆదిమ జాతి గిరిజనులు వారం రోజులుగా విషజ్వరాలతో మంచాన పడ్డారు. గత వారం రోజులుగా పలువురు జ్వరంతో బాద పడుతున్నారని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు డిమాండ్ చేశారు

పెదబయలులో భారీ వర్షం

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ :మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ విపరీతమైన ఎండ కాసింది. సాయంత్రం 3గంటల నుండి మేఘావృతమై 5 గంటల వరకు కుండ పోత భారీ వర్షం కురవడంతో గిరిరైతులకు ఊరట కలిగింది.

కురుస్తున్న వర్షం

జర్నలిస్టుల హెల్త్ కార్డులతో కలెక్టర్ మల్లికార్జున తదితరులు

జర్నలిస్టులకు హెల్త్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులకు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం హెల్త్ కార్డులు అందజేశారు. జిల్లాలో పని చేస్తున్న 172 మందికి ఇప్పటి వరకూ జిల్లా యంత్రాంగమే పూర్తి నగదు చెల్లించి కార్డులు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇది వరకూ నిర్వహించినట్లుగానే అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు మరొక్కసారి డయాగ్నోస్టిక్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేయిస్తామని తెలిపారు. మిగిలిన వారికి త్వరలోనే కార్డులు అందజేస్తామన్నారు. హెల్త్ కార్డుల కోసం దరఖాస్తుల సమర్పణ, నగదు చెల్లింపు ఇతర విషయాల్లో ఏమైనా సందేహాలుంటే కిశోర్‌ను 8008656504, లావణ్యను 8143504193 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు వి.మణిరామ్, కమిటీ సభ్యులు కెజి.రాఘవరెడ్డి, బాపూరావు, అనురాధ, ఎం.చిట్టిబాబు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మోహన లక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు శుక్రవారం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని పూజలు చేశారు.

కామన్వెల్త్ మాస్టర్ ఛాంపియన్ షిప్‌కు శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నవంబర్ 15 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో జరగనున్న కామన్వెల్త్ మాస్టర్ ఛాంపియన్ షిప్‌కు డాక్టర్ డివిఎస్‌వై.శర్మ ఆటగానిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎల్ఐసి విశాఖ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ కె.భగవాన్‌ప్రసాద్ తమ కార్యాలయంలో ఆయన్ని సత్కరించారు. శర్మ ఎల్ఐసి విశాఖపట్నం డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. పలు జాతీయ ఛాంపియన్‌షిప్‌లలో కూడా పాల్గొంటున్నారు. ఆయన ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డ్ మెంబర్‌గానూ, టేబుల్ టెన్నిస్ బ్లూ బ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గానూ, ఆసియా ఛాంపియన్‌షిప్, వరల్డ్ ఛాంపియన్‌షిప్, శాఫ్ గేమ్స్, కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లకు అంపైర్‌గా వ్యవహరించారు.

టర్నర్ సత్రానికి భారీ ఆదాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని మెయిన్ రోడ్డులో ఉన్న టర్నర్ సత్రానికి మహర్దశ పట్టింది. 30 ఏళ్లుగా ఆదాయార్జనలో వెనుకబడ్డ టర్నర్ సత్రం తన వార్షిక ఆదాయాన్ని రూ.40 లక్షలు నుంచి రూ.75 లక్షల వరకు ఈసారి పెంచుకోగలిగింది. సత్రం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి మీడియాకు తెలిపిన సమాచారం మేరకు సత్రానికి ఆగ్నేయ, వాయువ్య భాగంలో ఉన్న ఖాళీ స్థలాలు నుంచి ఇదివరలో ఎటువంటి ఆదాయమూ వచ్చేది కాదు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల సహకారంతో చొరవ తీసుకొని ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను ఇఒ వేలం వేశారు. వాయువ్య భాగం 664 చదరపు గజాల ఖాళీ స్థలానికి రసపూర్ణ ఫుడ్స్ నెలకు రూ.లక్షా 76 వేలు, ఆగ్నేయ భాగంలో ఉన్న 622 చదరపు గజాల ఖాళీ స్థలానికి నెలకు రూ. లక్షా 56 వేలు చెల్లింపుపై దుర్గాప్రసాద్ అనే వ్యక్తి 11 ఏళ్ల లీజుకు హక్కు పొందారు. ఇలా సత్రం ఆదాయం పెరగడంతో పేదలకు విద్య, వైద్యానికి తగు సహకారం అందించే అవకాశం ఏర్పడినట్టు ఇఒ తెలిపారు. సత్రం ఆవరణలో ఉన్న తహశీల్దార్ కార్యాలయం కూడా కొన్నేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో సత్రం యజమాన్యం కోర్టులో కేసు వేసిందన్నారు. దీంతో ఈ నెల 10న రెవిన్యూ విభాగం అద్దె బకాయి మొత్తం రూ.10 లక్షలను సత్రానికి జమచేసినట్టు తెలిపారు.

పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దసరా సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని చెన్నయ్ సెంట్రల్ - భువనేశ్వర్ - చెన్నయ్ సెంట్రల్, చెన్నయ్ సెంట్రల్ - సంత్రాగచ్చి - చెన్నయ్ సెంట్రల్ స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 06073 ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ - భువనేశ్వర్ స్పెషల్ అక్టోబర్ 23, 30, నవంబర్ 6 తేదీల్లో రాత్రి 23.45 గంటలకు ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ నుంచి బయలుదేరి మరుసటి రోజు 12.15 గంటలకు విజయనగరం చేరుకుని మరలా 12.17 గంటలకు బయలుదేరి సాయంత్రం 18.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. 06074 భువనేశ్వర్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ స్పెషల్ అక్టోబర్ 24, 31, నవంబర్ 7 తేదీల్లో రాత్రి 21.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 01.47 విజయనగరం చేరుకొని మరలా 01.49 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.00 గంటలకు డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్‌కు చేరుకుంటుంది.

06071 డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ - సంత్రాగచ్చి స్పెషల్ అక్టోబర్ 21, 28, నవంబర్ 4 తేదీల్లో రాత్రి 23.45 గంటలకు ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు విజయనగరం చేరుకుని 12.17 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 03.45 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06072 సంత్రాగచ్చి - డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ స్పెషల్ అక్టోబర్ 23, 30, నవంబర్ 6 తేదీల్లో సాయంత్రం 5.00 గంటలకు సంత్రాగచ్చి నుంచి బయలుదేరి రాత్రి 19.20 గంటలకు విజయనగరం చేరుకుని మరలా 19:22 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్‌కు చేరుకుంటుంది.

కోరాపుట్ - కిరండూల్ మార్గంలో రైలు సేవల పునరుద్ధరణ

కోరాపుట్ - కిరండూల్ మార్గంలో రైలు సేవలను పునరుద్ధరించారు. శుక్రవారం విశాఖపట్నం - కిరండూల్ ప్యాసింజర్ స్పెషల్ (08551)ను ఈ మార్గంలో పంపారు. కోచింగ్ రైళ్లను సురక్షితంగా నడిపే క్రమంలో తగు జాగ్రత్తలు చేపట్టారు. పగటి పూట పరిమిత వేగంతో నడిచే 08551 ప్యాసింజర్ స్పెషల్‌ను కిరండూల్ వరకు నడపడానికి ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు. దీనికి ముందు గూడ్స్ రైలును ప్రయోగాత్మకంగా ఈ మార్గంలో నడిపారు. ట్రాఫిక్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఇంజినీరింగ్ వంటి వివిధ విభాగాల ఇన్‌స్పెక్టర్లు రైలు ప్రయాణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ ప్రాంతంలో రైలు సేవలను పూర్తిగా పునరుద్ధరించడం, రవాణా కనెక్టివిటీని మెరుగుపరచడంలో ఇది మొదటి అడుగు అని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

యుద్ధం ఆపాలంటూ సిపిఎం ప్రదర్శన

విశాఖ నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని, శాంతిని నెలకొల్పే విధంగా ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సింగ్ హోటల్ జంక్షన్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ పాలస్తీనా 1914 నుంచి బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి స్వతంత్ర దేశంగా ఏర్పడిందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆయిల్ చమురు నిక్షేపాలపై పట్టుసాధించేందుకు ప్రపంచపటంలో లేని ఇజ్రాయిల్‌ను అమెరికా సృష్టించినట్టు తెలిపారు. అనేక సార్లు యుద్ధాలు చేసి పాలస్తీనాను ఆక్రమించుకుంటోందన్నారు. నేడు గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ దాడికి దిగడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇజ్రాయిల్‌లో పర్యటించి యుద్ధోన్మాదాన్ని మరింత రెచ్చగొట్టే చర్యలకు పూనుకోవడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. భారత దేశం ప్రారంభం నుంచి అలీన విధానానికి కట్టుబడి ఉందని, శాంతిని కోరుకునే దేశం మనదని అన్నారు. పాలస్తీనాపై గతంలో ఇజ్రాయిల్ దాడి చేస్తే పాలస్తీనాకు మద్దతుగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ నేడు మోడీ ప్రభుత్వం అమెరికాకు తొత్తుగా వ్యవహరిస్తూ ఇజ్రాయిల్‌కు అనుకూలంగా ఉండటం దేశానికే ప్రమాదకరమని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా ప్రజలకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ధరలు భారీగా పెరిగి ప్రజలపై పెను భారాలు పడతాయన్నారు. మతోన్మాదులు, యుద్ధోన్మాదుల వల్ల ప్రపంచ శాంతికి భంగం కలుగుతుందన్నారు. తక్షణమే యుద్ధం ఆపి శాంతి నెలకొల్పాలని కోరారు. పాలస్తీనాకు మద్దతుగా నిరసనలు తెలియజేసేవారిపై నిర్బంధం ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.జగన్, కెఎం.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, ఎం.రాంబాబు, బి.వెంకటరావు, నరేంద్రకుమార్, డి.అప్పలరాజు, రాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యాన..

కలెక్టరేట్ : యుద్ధం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల నాయకులు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.జగన్, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక మాట్లాడారు. యుద్ధం ఎప్పుడూ ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తుందని, ప్రపంచ శాంతిని కొల్లగొడుతుందని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, న్యాయవాది పూర్ణిమ, డివైఎఫ్ఐ నాయకులు శ్రావణ్, శరత్, మహేష్, వాసు, గిరిజన సంఘం నాయకులు కోటి పాల్గొన్నారు.

కొయ్యూరు మండలం ఎం.మాకవరంలో నిర్వహించిన శిబిరంలో నాయకులు, ప్రజలు

గ్రామాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం గ్రామపంచాయితీ పరిధిలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దీనిని సర్పంచ్ మంగా బొజ్జయ్య ప్రారంభించారు. సుమారుగా 400మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఎన్ జాన్ మిల్టన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని ఎం.మాకవరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపీపీ బడుగు రమేష్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు కోడా చింతల్లి రాజబాబు, సెగ్గే రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు పొడుగు రత్నం తదితరులు పాల్గొన్నారు.

'టికెట్ ఎవరికిచ్చినా కలిసి పనిచేస్తాం'

ప్రజాశక్తి-కొయ్యూరు : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీల మధ్య పొత్తు కుదిరిన నేపథ్యంలో పాడేరు నియోజకవర్గం జనసేన పార్టీకే కేటాయిస్తారని విశ్వాసం తనకు ఉందని జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంపూరు గంగులయ్య తెలిపారు. మండలానికి విచ్చేసిన గంగులయ్య శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ గతంలో టిడిపి సిపిఐ, బిజెపిలతో పొత్తుకుదుర్చుకున్న సంధర్భాల్లో పాడేరును మిత్రపక్షాలకే టిడిపి వదిలేసిన విషయాన్ని గంగులయ్య గుర్తు చేస్తూ ఇదే సాంప్రదాయం ప్రకారం ఇప్పుడు పాడేరును జనసేనకే కేటాయిస్తుందని తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. అయితే తాము మిత్రధర్మాన్ని పాటించి టికెట్ ఎవరికిచ్చినా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిలో రాజన్న, మాకాడ భీమన్న, చింత పల్లినేత దేపురంరాజు, అశోక్‌కుమార్, గూడెం లక్ష్మణ్, సాగిన బుజ్జి బాబు, పీటా సుధీర్, కారం గినవీన్, చిలకా నాగార్జున, నివాస్, దుచ్చరిరమేష్, పొట్టికరాంప్రసాద్, కూడా దేముడు, పురాజేష్, నత్తూరు శ్రీనుబాబు, నాగేంద్ర, జుర్రా సూర్యప్రకాష్, సిహెచ్. సిద్ధూ పాల్గొన్నారు.

గిరిజన యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం, సీలేరుకు చెందిన గిరిజన యువకుడు కొర్ర కొక్‌పతి (24) విశాఖపట్నంలో అదృశ్యమయ్యాడు. బంధువుల కథనం ప్రకారం... సీలేరు గ్రామపంచాయతీ దుర్గవీధికి చెందిన కమల తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో ఆమె తమ్ముడు గురుబంధు, తన బావమరిది కొర్ర కొక్‌పతి (24)తో కలిసి ఈనెల 13న కమలను వైద్య సేవలు నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి తీసుకెళ్లారు. రెండు రోజులు అనంతరం గురుబంధు తన బావమరిది కొక్‌పతికి రూ.500 ఇచ్చి సీలేరు వెళ్లిపోవాలని సూచించారు. దీంతో కొక్‌పతి 15వ తేదీ రాత్రి 7.30 గంటలకు సీలేరు మీదుగా వెళ్లే విశాఖపట్నం -భద్రాచలం బస్సు ఎక్కాడు. లంకెలపాలెం వచ్చే సరికి టికెట్ తీయాలని కండక్టర్ అడగ్గా తన వద్ద డబ్బులు లేవని కొక్‌పతి తెలిపాడు. దీంతో కండక్టర్ బస్ దిగాలని సూచించగా, ఆయన అక్కడ దిగిపోయాడు. తరువాత వేరొకరి సహాయంతో తన అక్క సుమతికి సీలేరు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. బావ ఇచ్చిన డబ్బులతో ఛార్జీ కట్టుకొని రావాలని ఆమె సూచించింది. ఆ డబ్బులు పోయాయని కొక్‌పతి చెప్పగా ఆమె నమ్మలేదు. నాటి నుండి కొక్‌పతి ఇంటికి రాలేదు. ఐదు రోజులు గడుస్తున్నా కొక్‌పతి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు గురై ఆయన ఆచూకీ కోసం వాట్సాప్ గ్రూపుల్లో కొక్‌పతి ఫోటోను షేర్ చేశారు. అయినా ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బావ గురుబంధు ప్రజాశక్తిని ఆశ్రయించి తన బావమరిది అదృశ్యం గురించి తెలియజేశారు. కొక్‌పతికి భార్య, ఒక పాప ఉన్నారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు 8500097642 ఫోన్ నెంబర్‌కి తెలియజేసి తమకు సహకరించాలని గురుబంధు కోరారు